సాక్షి చిత్తూరు

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



నత్తనడకన అమృత్ భారత్

చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోంది. - 10లో



హుండీ ఆదాయం రూ.4.13 లక్షలు

రాజనాల బండ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4.13 లక్షలు వచ్చింది. - 10లో



రేషన్ బియ్యం స్వాధీనం

తమిళనాడు నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు గుడిపాల ఎస్ఐ తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

వారి కడుపుకొట్టి ఏం సాధిస్తారు బాబూ?



విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అడ్డగోలు నిబంధనలతో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణమని చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాబు సర్కారుకు తప్పనిసరిగా దివ్యాంగుల ఉసురు తగులుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి పింఛన్ మంజూరైందన్నారు. తాము అధికారంలోకి వస్తే వారికి అదిక పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నమ్మి ఓట్లేసిన దివ్యాంగులకు ఇప్పుడు నోటీసులు జారీ చేసి పింఛన్ ఎత్తివేస్తున్నారని మండిపడ్డారు. కొత్త పింఛన్లు దేవుడెరుగు.. ఉన్న పింఛన్లకు కోత పెడుతుండడంతో బాధితులకు దిక్కుతోచడం లేదన్నారు. ప్రస్తుతం రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు కోత విధిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో దాదాపు 5వేల మందికి నోటీసులు ఇచ్చారన్నారు. వీరిని అనర్హులుగా తేలుస్తూ వచ్చే నెల నుంచి పింఛన్లు నిలిపివేయనున్నట్లు తెలుస్తోందన్నారు. ప్రతినెలా ఆహారం, మందులు ఇతర ఖర్చులకు పింఛనే ఆధారమన్నారు. ఇప్పుడు పింఛన్ తొలగిస్తే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు.

అంతర్ జిల్లా బదిలీలకు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖ అధికారులు అంతర్ జిల్లా బదిలీలకు కసరత్తు ప్రారంభించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన ఉత్తర్వులను అనుసరించి కసరత్తు చేపడుతున్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ అంతర్ జిల్లా బదిలీలకు అర్హులైన టీచర్లు గడువు తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ మహిళా జట్ల ఎంపిక రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ మహిళల జట్ల ఎంపిక ఈ నెల 23న ఉంటుందని ఆ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 23న జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి మహిళా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 30, 31 తేదీల్లో పల్నాడు జిల్లా దూబిపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర సమాచారానికి 9581887409, 7013989059 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హే..కృష్ణా!





హంద్రీ–నీవా పుంగనూరు ఉప కాలువలో వస్తున్న కృష్ణా జలాలు, (ఇన్‌సెట్) అక్రమార్కుల దెబ్బకు సర్వనాశనమైన బైరెడ్డిపల్లి పెద్ద చెరువు

కూటమి నేతల దెబ్బకు ధ్వంసమైన చెరువులు

- యథేచ్ఛగా మట్టి, ఇసుక అక్రమ రవాణా
- వర్షమొచ్చినా వీటిల్లో నీరు చేరని పరిస్థితి
- ఇలాంటి పరిస్థితుల్లో కృష్ణా జలాలే దిక్కు
- ఆశగా ఎదురు చూస్తున్న పలమనేరు, కుప్పం రైతులు

పలమనేరు: పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని పలు చెరువులను కూటమి నేతలు చెరబట్టారు. చాలా చెరువుల్లో మట్టి, ఇసుక తవ్వేయడంతో గుంతలమయమయ్యాయి. వర్షాలొచ్చినా నీరు చేరక చెరువులు ఎడారిని తలపిస్తున్నాయి. ఈ క్రమంలో భూగర్భజలాలు అడుగంటాయి. డివిజన్ పరిధిలో 80 వేల వ్యవసాయ బోర్లుండగా ఇప్పటికే 20 వేల బోర్లలో నీరు తగ్గుముఖం పట్టింది. ఇప్పుడు పడుతున్న వర్షాలతో వర్షపు నీరు చెరువుల్లోని గుంతలు కూడా నిండడం లేదు.

అధికార పార్టీ అండతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. వాగులు, వంకలు, చెరువుల నుంచి యథేచ్ఛగా మట్టి, ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా చెరువులు చాలావరకు ధ్వంసమయ్యాయి. వర్షాలు పడినా చెరువుల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. ఫలితంగా భూగర్భ జలాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఇప్పుడు హంద్రీ–నీవా పుంగనూరు ఉపకాలువ మీదుగా కుప్పం ఉప కాలువకు వస్తున్న కృష్ణా జలాలను పలమనేరు, కుప్పం ప్రాంతాల్లోని చెరువులుకు నింపాల్సి ఉంది. లేనిపక్షంలో జిల్లాలోని పడమటి మండలాలు ఎడారిగా మారే అవకాశం ఉంది.. ఈ క్రమంలో కూటమి నేతలు ఎలా స్పందిస్తారోనని రైతులు నిశ్చితంగా పరిశీలిస్తున్నారు.

నాలుగు రోజుల్లో కృష్ణా జలాలు

కృష్ణా జలాలు చెర్లోపల్లి రిజర్వాయర్‌కు ఇప్పటికే చేరాయి. అక్కడి నుంచి పుంగనూరు, కుప్పం ఉపకాలువ మీదుగా మరో నాలుగైదు రోజుల్లో పెద్దపంజాణి మండలం, అప్పినపల్లి(224.5 కిమీ)కి చేరుకునే అవకాశం ఉంది. ఆపై ఇవి బైరెడ్డిపల్లి, వీకోట మీదుగా కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రంలోకి చేరుకోనున్నాయి.

ఇదీ చెరువుల దుస్థితి

పలమనేరు ఇరిగేషన్ పరిధిలో మొత్తం 787 చెరువులున్నాయి. వీటిల్లో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు (100 ఎకరాల విస్తీర్ణం గలవి) 57 దాకా ఉన్నాయి. చిన్నపాటి కుంటలు 60 దాకా ఆక్రమణలకు గురై కనిపించకుండా పోయాయి. మిగిలిన వంద దాకా చెరువులు 10 నుంచి 30 శాతం ఆక్రమణకు గురయ్యాయి. ఇప్పటికే కూటమి నేతల దెబ్బకు చెరువులు గుంతలమయయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలతో వర్షపు నీరు ఈ గుంతల్లోకి సైతం రాని పరిస్థితి. ఎటూ వానలొచ్చినా చెరువుల్లోకి నీరురాదు కాబట్టి కృష్ణా జలాలతో వీటిని నింపడం మినహా మరో మార్గం లేదు.



కేబీసీ, పీబీసీలకు నీరందే చెర్లోపల్లి రిజర్వాయర్ ఇదే

ఇక్కడి చెరువుల అనుసంధానమే లక్ష్యం

హంద్రీ–నీవా– సుజల స్రవంతి పథకంలో భాగంగా రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలైన(కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు) ల్లోని 6,025 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగు నీటిని అందించడమే దీని లక్ష్యం. ఇందుకోసం కృష్ణా నది నుంచి 120 టీఎంసీల నీటిని ఇక్కడికి తరలిస్తున్నారు. పుంగనూరు ఉపకాలువ నుంచి 143.9 కి.మీ మేర ప్రయాణించి కుప్పం ఉపకాలువ ద్వారా పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 8 మండలాలకు 4.02 లక్షల మందికి తాగునీరు, 110 చెరువులకు సాగు నీటిని మళ్లించనున్నారు. ఇక్కడి చెరువుల పరిధిలోని 6,300 ఎకరాల భూములకు సాగునీటిని అందించాలన్నది దీని లక్ష్యంగా నిర్దేశించారు. దీంతో కృష్ణా జలాలను ఇక్కడి ఎంఐ(మేజర్ ఇరిగేషన్ ట్యాంకులు) చెరువులను నింపాలని రైతులు కోరుతున్నారు.

అది నెరవేరితే చాలు సామీ



హంద్రీ–నీవా జలాలు వస్తున్నాయంటున్నారు. వాటిని ఇక్కడి చెరువులకు నింపాలి. భూగర్భజలాలు పెరగాలి. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి ఇబ్బందులు తప్పాలి. 6,300 ఎకరాల్లో చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణకు 0.5 టీఎంసీల సాగునీరు, 4.02 లక్షల మందికి 0.6టీఎంసీల తాగునీరు అందుతుందని మాట ఇచ్చారు. ఆ మాట నిలబెట్టుకోవాలి. – రామరాజ్, రామాపురం, రైతు, బైరెడ్డిపల్లి మండలం

భూగర్భ జలాలు పెరుగుతాయి



నాకు మూడెకరాల పొలం ఉంది. మా పొలం మధ్యలోనే హంద్రీ–నీవా కాలువ వచ్చింది. పొలం పోగొట్టుకున్నప్పుడు బాధ కలిగింది. గత ప్రభుత్వంలో కాలువలో నీరు వదిలినప్పుడు భూగర్భజలాలు పెరిగాయి. అందుకే ఈ ప్రాంతంలోని చెరువుల్లోకి కృష్ణా నీటిని నింపాలి. అప్పుడు ఇక్కడున్న బోర్లలో నీరు బాగా వస్తే దిగులుండదు. – శ్రీనివాసులు, గుండుగల్లు, గంగవరం మండలం

చెరువులు నిండితే చాలు



నాకు రెండెకరాల పొలం ఉంది. అందులో మూడు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. ఎందుకంటే చెరువుల్లో నీరు లేదు. హంద్రీ–నీవా కాలువ ద్వారా వచ్చే నీటితో ఇక్కడి చెరువులను నింపాలి. అప్పుడే బీడు భూములుగా మారిన పొలాలు మళ్లీ పచ్చగా మారతాయి. – వెంకట్రమణ, బొమ్మరాజుపల్లి, గంగవరం మండలం

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు కసరత్తు




చిత్తూరు కలెక్టరేట్ : మెగా డీఎస్సీ పరీక్షల్లో ఎంపికయ్యే అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు రాసిన అభ్యర్థుల మార్కుల స్కోర్ జాబితాలను ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన విషయం విధితమే. ఈ జాబితాల్లో పలువురు అభ్యర్థుల టెట్ ఫలితాలు తప్పుగా నమోదు కావడంతో సరిదిద్దుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే రోస్టర్, మెరిట్ ఆధారంగా తుది అభ్యర్థుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో ప్రచురించనున్నారు. ఆ తర్వాత సర్టిఫికెట్ల కసరత్తు నిర్వహించనున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ సూచనల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ఇటీవల రాష్ట్ర స్థాయిలో శిక్షణ సైతం పూర్తి చేశారు. ఇక రాష్ట్ర విద్యాశాఖ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే తరువాయి.

రెండు ఇంజినీరింగ్ కేంద్రాలు ఎంపిక

చిత్తూరు జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఉండే అపోలో యూనివర్సిటీ, ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలను సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో అర్హత సాధించే 1,473 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. పరిశీలను 30 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

కొత్త పంథా..ఇసుక దందా







పట్ట కప్పి ఇసుక తరలిస్తున్న దృశ్యం, ఇసుక పై కప్పిన వరి పొట్టు, పట్టుబడిన లారీ

సాక్షి టాస్క్ ఫోర్స్: గుడూరు వయా చిత్తూరు మండలం మీదుగా తమిళనాడుకు పుష్ప రేంజ్‌లో ఇసుక దందా నడుస్తోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ఈ అక్రమ వ్యవహారాన్ని స్థానికులు బట్టబయలు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలు.. సరిగ్గా మరో 5 నిమిషాల్లో జిల్లా సరిహద్దు దాటి తమిళనాడుకు వెళ్లిపోయే సమయంలో చిత్తూరు మండలం, అనంతాపురం గ్రామం వద్ద గురువారం ఓ లారీ టైరు పేలి నిలిచిపోయింది. తీరా ఆ లారీ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న బండేనని స్థానికులు నిర్ధారణకు వచ్చి.. అధికారులకు సమాచారం అందించారు. వాళ్లు స్పందించకపోవడంతో లారీ పైన కట్టిన పట్టను విప్పి చూడగా.. ఇసుకపై వరి పొట్టు బ్యాగులను నింపి ఉండడం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న బీఎన్ఆర్ పేట ఎస్ఐ నాగసౌజన్య లారీని అదుపులోకి తీసుకున్నారు. కాగా దీనిపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈ అక్రమ వ్యవహారం మొత్తం నెల్లూరు జిల్లాకు చెందిన ఓ బడా కూటమి నేత కనుసన్నల్లో జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ వాహనాన్ని వదిలిపెట్టేయాలని పోలీసులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఎస్ఐ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. స్థానికులు కూడా దీనిపై సమాచారం అందిస్తే గోప్యంగా ఉంచుతామని ఆమె పేర్కొన్నారు.

యూరియా..లేదయ!

జిల్లాలో యూరియా నోస్టాక్

- అవస్థల్లో రైతులు
- రైతు సమైఖ్య సెంటర్లకు వచ్చినా గంటల్లోనే ఖాళీ



పలమనేరులోని రైతుసంఘ సెంటర్‌లో గురువారం యూరియా కోసం క్యూకట్టిన రైతులు

పలమనేరు: జిల్లాలో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మొన్నటి దాకా కాంప్లెక్స్ కొంటేనే యూరియాను అమ్మిన ఫర్టిలైజర్స్ యజమానులు ఇప్పుడు నోస్టాక్ బోర్డులు పెట్టేశారు. హోల్‌సేల్ కంపెనీల నుంచి డైరెక్ట్‌గా అందే జిల్లాలోని గ్రోమోర్ అవుట్‌లెట్లు, రైతు సమాఖ్య దుకాణాల్లో మాత్రం అప్పుడప్పుడు అందే లోడ్డు యూరియా కోసం వందలాది మంది రైతులు ఎగబడేవారు. వారిని నియంత్రించేందకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసేవారు. చాలీ చాలకుండా వచ్చే స్టాకు గంటల వ్యవధిలోనే ఖాళీ అయ్యేది. పలమనేరులో ఓ రైతు సమాఖ్య వారు గురువారం ఓ లోడ్డు యూరియాను తెప్పించారు. రైతులు అక్కడికి వందలాది మంది చేరుకుని క్యూ కట్టారు.

కర్ణాటకలోనూ నోస్టాక్

జిల్లాలో యూరియా లేక ఇప్పటిదాకా రైతులు పొరుగునే ఉన్న కర్ణాటక వెళ్లి యూరియాను తెచ్చుకొనేవారు. కానీ ఇక్కడ నెలకొన డిమాండ్ కారణంగా అక్కడ కూడా యూరియా దొరకడం లేదు. ఉన్న యూరియా అంతా ఆంధ్రావాళ్లకే చాలడం లేదు.. ఇక మా వద్ద స్టాకెక్కడుంటుందనే మాట అక్కడి వ్యాపారుల నుంచి వినిపిస్తోంది.

అమాంతం పెరిగిన ధరలు

స్థానికంగా యూరియా దొకరడం లేదు. దీన్ని అదునుగా చేసుకొని కర్ణాటకకు చెందిన కొందరు వ్యాపారులు యూరియాను ఇక్కడికి తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. స్థానికంగా యూరియా బస్తా ధర రూ.270 కాగా అది రూ.300 దాటింది. అంత ధర ఇస్తామన్నా యూరియా దొరడం లేదు. బస్తా రూ.400 నుంచి రూ.500 దాకా పెట్టి అమ్మకాలు చేస్తున్నా యూరియా నిమిషాల్లోనే అయిపోతోంది.

క్యూకట్టిన రైతులు

పలమనేరు ప్రాంతంలో ఇటీవల వర్షాలకు వరినాట్లు వేశారు. ఇప్పుడు యూరియా వరికి చాలా అవసరం. దీంతోపాటు పశుగ్రాసానికి కూడా అవసరం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో స్థానికంగా యూరియా అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో ఇక్కడి రైతు సమాఖ్య వారు గురువారం ఓ లోడ్డు యూరియాను తెచ్చారు. దీనికోసం వందలాది మంది షాపు తెరవకముందే క్యూ కట్టారు. వీరిని అదుపు చేయలేక స్థానిక పోలీసులు బందోబస్తుకు రావాల్సి వచ్చింది.

జిల్లా సమాచారం

ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం
- 1.70 లక్షల హెక్టార్లు
ఇప్పటిదాకా సాగైన విస్తీర్ణం
- 60వేల హెక్టార్లు
ఈ దఫా వరిసాగు విస్తీర్ణం
- 27వేల హెక్టార్లు
ప్రస్తుతానికి కావాల్సిన యూరియా
- 20వేల బస్తాలు
అందుబాటులో ఉన్న యూరియా
- 2వేల బస్తాలు

గతంలో గ్రామాల్లోనే యూరియా



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉండేది. కూటమి పాలనలో యూరియా కోసం పడుతున్న కష్టాలు అన్నీఇన్నీకావు. బస్తా యూరియా కోసం పనీపాట వదలుకొని అవస్థలు పడాల్సి వస్తోంది. వాస్తవంగా బస్తా యూరియా రూ.270. ఇక్కడ లేకపోవడంతో కర్ణాటక నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఖర్చుతో కలిపి మొత్తం బస్తా రూ.350 దాకా ఖర్చుచేయాల్సి వస్తోంది. – నరసింహారెడ్డి, ఎగువ మారుమూరు, పలమనేరు మండలం

వారంగా తిరుగుతున్నా



ఈ మధ్య కురిసిన వానలతో కొంత పొలంలో వరి సాగుచేశా. ఆ పంట పసుపు రంగులోకి మారింది. ఓ బస్తా యూరియా చల్లాలని వారం రోజులుగా పలమనేరులోని దుకాణాల వద్దకు తిరుగుతున్నా. మొన్నటి దాకా యూరియా కావాలంటే కాంప్లెక్స్ కొనాలన్నారు. దానికి కూడా రెడీ అంటున్నా యూరియా దొరకడం లేదు. ఏం చేయాలో తెలియడం లేదు. – సుబ్బన్న, గొల్లపల్లి, రైతు, పలమనేరు మండలం

పల్లె నిధులు ఖర్చు చేయరా?

- జిల్లాలో మిగులు నిధులు రూ.10 కోట్లు



చిత్తూరు కార్పొరేషన్: పనుల ఎంపికలో కూటమి ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. జిల్లాలో మొత్తం 697 పంచాయతీలుండగా.. వీటికి ప్రధానంగా రాష్ట్ర, కేంద్ర నిధులే ఆధారం. కానీ ఉన్నవాటిని వినియోగించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. గత ఆర్థిక సంఘం నిధులు కూడా సక్రమంగా ఖర్చుచేయలేకపోతున్నారు. ప్రస్తుతం వివిధ పంచాయతీల్లో దాదాపు రూ.10 కోట్లకుపైగా నిధులు మిగిలిపోయాయి. వీటిని సకాలంలో ఖర్చు చేయని పక్షంలో నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది.

ఇక్కడే ఎక్కువ

జిల్లాలో దాదాపు 60 పంచాయతీలకు పైగా ఎప్పటి నుంచో మిగులు నిధులు ఉన్నాయి. అందులో తవణంపల్లె మండలం, పట్నం పంచాయతీలో రూ.27.44 లక్షలు, అరగొండలో రూ.14.77 లక్షలు, వి.కోట మండలం, కొంగాటం పంచాయతీలో రూ.15.16 లక్షలు, బంగారుపాళ్యం గ్రామ పంచాయతీలో రూ.11.05 లక్షలు, రామకుప్పం మండలం, కొంగనపల్లె పంచాయతీలో రూ.10.58 లక్షలు, జీడీనెల్లూరు గ్రామ పంచాయతీలో రూ.8.84 లక్షలు, పెద్దపంజాణి మండలం, ముత్తుకూరు పంచాయతీ పరంగా రూ.8.80 లక్షలకుపైగా ఉంది. వీటిని సకాలంలో ఖర్చుచేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఖర్చు చేయిస్తాం

కొన్ని పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధులు మిగిలి ఉన్నాయి. వాటిని సకాలంలో పంచాయతీల అభివృద్ధి ఖర్చు చేయాలని కార్యదర్శులను ఆదేశించాం. దాదాపు జిల్లాలో రూ.10 కోట్ల వరకు ఉన్న నిధులు ఖర్చు చేస్తాం. – సుధాకర్‌రావు, డీపీఓ

25న ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు అర్బన్: ఏపీ ఎస్సీ కానిస్టేబుల్‌గా ఎంపికైనా అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఈ పరిశీలన చిత్తూరు నగరంలోని ప్రశాంత్‌నగర్, జిల్లా పోలీసు కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు ఎంపిక సమయంలో సమర్పించిన అన్ని ఒరిజినల్ పత్రాలను తీసుకోరావాలని సూచించారు. మూడు సెట్ల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారితో అటెస్టెడ్ చేసుకుని, నాలుగు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

ఒరిగిందేమీ లేదు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం గురువారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగిందేమీ లేదని వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు జరిగేలా క్యాబినెట్ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ విషయం ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు.

వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న పీజీటీ, టీజీటీల వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌కు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అవకాశం కల్పించారు. ఇందుకు చేపట్టాల్సిన నియమాలను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న పీజీటీ, టీజీలను తాత్కాలిక విధానంలో అడ్జెస్ట్‌మెంట్ చేసేలా కసరత్తు చేపట్టాలని డీఈవోకు సూచించారు.

గడువు పెంపు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీలో పది, ఇంటర్ అడ్మిషన్లకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ఓపెన్ స్కూల్ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. 2025–26 విద్యాసంవత్సరంలో పది, ఇంటర్ అడ్మిషన్లకు సంబంధించి రూ.200 లేట్ ఫీజుతో సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు.


కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్ బుక్ అకౌంట్

చిత్తూరు కలెక్టరేట్ : హ్యాకర్ల ఆగడాలు శ్రుతిమించుతున్నాయి. ఏకంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఐఏఎస్ పేరుతో నకిలీ ప్రొఫైల్‌ను ప్రారంభించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో నిజమైన ఫేస్ బుక్ ఖాతా నుంచి అలెర్ట్ మెసేజ్ పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ తన ఒరిజినల్ ఫేస్ బుక్ అకౌంట్ నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అత్యవసర సమాచారం అంటూ మెసేజ్‌ను పోస్ట్ చేశారు.

రైల్వేస్టేషన్ ప్రవేశ మార్గంలో అధ్వాన్నంగా ఉన్న దారి



సక్రమంగా తెరుచుకోని మరుగుదొడ్లు



స్టేషన్ ప్రవేశ మార్గంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



నత్తనడకన అమృత్ భారత్



మందకొడిగా జరుగుతున్న గ్రానైట్ పనులు

- రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.14 కోట్లు మంజూరు
- అంతంతమాత్రంగా సాగుతున్న పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప కృషితో అమృత్‌భారత్ పథకం కింద అభివృద్ధి పనులు చేయడానికి చిత్తూరు రైల్వేస్టేషన్ ఎంపికైంది. ఆధునీకరణ, అభివృద్ధి పనులు చేసేందుకు రూ.14 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఏడాదిన్నర క్రితం చేపట్టిన అభివృద్ధి పనులు నేటికి సగం మాత్రమే పూర్తయ్యాయి. రైల్వేస్టేషన్ చుట్టుపక్కల మండలాల నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. రాత్రి సమయాల్లో రైళ్ల కోసం వేచి చూస్తుంటారు. కానీ సరైన వసతులు లేకపోవడంతో నరకం అనుభవిస్తున్నారు.

జాప్యంపై ఆగ్రహం

గతంలో గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్, సీతా, ఇతర పై స్థాయి అధికారులు తనిఖీ చేసి అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. 50 శాతం పనులు మాత్రమే చేయడం పై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రివేళ ప్లాట్‌ఫాంలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. స్టేషన్ ప్రవేశమార్గం రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో అటువైపుగా రావాలంటే తిప్పలు తప్పడం లేదు. స్టేషన్ ఆరంభంలో ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేయించుకొని అనధికారికంగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆగని రైళ్లు

తిరుపతి–రామేశ్వరం, హౌరా–పాండిచ్చేరి, ఓకా–రామేశ్వరం, తిరుపతి–రామేశ్వరం, టాటా–యశ్వంత్‌పూర్, కన్యాకుమారి, హతియా–యశ్వంత్‌పూర్, హౌరా–పాండిచ్చేరి రైళ్లు చిత్తూరు మీదుగా వెళ్తున్నప్పటికీ ఇక్కడ ఆగడం లేదు. ఈ రైళ్లలో ప్రయాణించాలంటే పాకాల లేదా తిరుపతికి వెళ్లి ఎక్కాల్సిందే. చిత్తూరు నుంచి చెన్నైకి నేరుగా రైలు లేదు. వేలూరు నుంచి చెన్నైకి వెళ్లే రైలును చిత్తూరులో నుంచి ఎక్కే సౌకర్యం కల్పించాలని నగర వాసులు కోరుతున్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

అరకొరగానే అభివృద్ధి పనులు

ఏడాదిన్నర క్రితం రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ అరకొరగానే సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న భవనాన్ని పడగొట్టి దాని వెనుక(పార్కు) ముందు కొత్త భవనాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. స్టేషన్‌లో ఫ్లోరింగ్, భవనాలను నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫాం పొడవును మరింత పొడిగించాలి. ప్లాట్‌ఫాం వెనుక ప్రత్యేక రూఫ్ షెడ్లు ఏర్పాటు చేయాలి. వెయిటింగ్ హాల్స్, కెఫెటీరియాలు ఏర్పాటు చేయాలి. స్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్ రోడ్డు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రవేశ మార్గాలు, వీల్‌చైర్స్, గ్రౌండ్ వాటర్ ట్యాప్ తదితర సదుపాయాలు కల్పించాలి. కొత్తగా లిఫ్ట్, 5జీ సేవలు అందుబాటులోకి తేవాలి. కానీ ఇందులో లిఫ్ట్ మినహాయించి ఏ పనీ పూర్తి స్థాయిలో చేపట్టలేదు. అదనపు గదుల నిర్మాణం, వెయిటింగ్ హాలుకు మరమ్మతులు, ప్లాట్‌ఫాం విస్తరణ పెంపు, గ్రానైట్, టైల్స్ ఏర్పాటు, రైల్వే స్టేషన్ ముఖద్వారం పూర్తి స్థాయిలో ఆధునికీకరణ, ప్రాంగణం చుట్టూ ప్రహరీ, పార్కింగ్ టైల్స్ వంటి పనులు నత్తనడకన సాగుతున్నాయి.



సా...గుతున్న భవన నిర్మాణ పనులు

పనులు త్వరగా పూర్తి చేయాలి



రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు నెలల తరబడి చేస్తున్నారు. అంత మొత్తం నిధులు వచ్చినప్పుడు ఎంత వేగంగా పనులు చేయాలి..?. కానీ ఎప్పుడూ సాకులు చెబుతూ..ఆలస్యం చేస్తున్నారు. ప్రయాణికులు, వారి కుటుంబీకులకు అసౌకర్యంగా ఉంది.

– అశోక్‌కుమార్, మాజీ బ్యాంకు అధికారి, చిత్తూరు

అన్ని రైళ్లూ ఆగేలా చూడాలి



పలు రైళ్లు ఆపకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్మీ ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వీటి పై ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఇటువైపు వచ్చే అన్ని రైళ్లు ఇక్కడ తప్పకుండా ఆగాలి. అప్పుడే సౌకర్యవంతంగా ఉంటుంది.

– సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ

కళాఉత్సవ్‌కు నిధులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కార్వేటినగరం ప్రభుత్వ డైట్ కళాశాలలో కళా ఉత్సవ్ నిర్వహణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. కళా ఉత్సవ్ కార్యక్రమ నిర్వహణకు రూ.50 వేలు మంజూరైనట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

ఐదుగురు జేఎల్‌ఎంలపై వేటు

- అధికారుల పై తప్పుడు ఫిర్యాదుకు ప్రతిఫలం
- కలెక్టర్ ఆదేశాలతో చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: అధికారుల పై ఆరోపణలు చేసి.. ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించడానికి యత్నించిన ఐదుగురు జేఎల్‌ఎం గ్రేడ్–2(సచివాలయ లైన్‌మెన్లు)ను సస్పెండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఈ మేరకు గురువారం ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర ఆదేశాలు జారీచేశారు. సస్పెండ్ అయినవారిలో కొంగారెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని రామకృష్ణ, మిట్టూరు నుంచి మల్లికార్జున, సంతపేట నుంచి దొరబాబు, పూతలపట్టు పరిధిలోని యశ్వంత్‌బాబు, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

అధికారులపై తప్పుడు ఫిర్యాదు

సచివాలయ వ్యవస్థ ఏర్పాటయ్యాక జేఎల్‌ఎం గ్రేడ్–2(జూనియర్ లైన్‌మెన్)గా పలువురు పరీక్షలు రాసి కొలువులు సాధించారు. వీరు భవిష్యత్‌లో ఉన్నత పదవులు పొందడానికి డిప్లొమా చేయాలని భావించారు. పనిచేస్తూ రాత్రి పూట పూతలపట్టులోని ఓ కళాశాలలో చదువుకోవాలని నిర్ణయించుకున్నారు. అందుకుగాను ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు. వీటిపై గతంలో నేరుగా జేసీ విద్యాధరిని కలిసి తాము పగలు విధులు నిర్వహించి, రాత్రి సమయంలో కళాశాలకు వెళ్లి చదువుకోవడానికి అనుమతివ్వాలని ఆ సంఘం నాయకులు విన్నవించారు. ఆమె స్పందిస్తూ రాత్రి సమయంలో దీర్ఘకాలిక అనుమతి ఇవ్వలేమని, కావాలంటే సెలవు పెట్టుకోవచ్చని సూచించారు. తర్వాత కలెక్టరేట్‌లో గత సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఇదే సమస్యపై కలెక్టర్‌కు విన్నవించారు. చదువుకోవడానికి అధికారులు అనుమతివ్వడం లేదని చెప్పారు. అక్కడే ఉన్న జేసీ కలుగజేసుకొని జరిగిన విషయంతా చెప్పారు.

ఆగ్రహించి..ఆదేశించి

స్పందించిన కలెక్టర్ జరిగిన విషయం చెప్పకుండా.. ఉన్నతాధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేయడం పై ఆగ్రహించారు. మీరు అధికారులను కోరి వారు నిబంధనలు చెప్పినా కూడా కొత్తగా నాకు వచ్చి సమస్య చెప్పి, వారి పైనే ఆరోపణలు చేస్తారా..? అని మండిపడ్డారు. ఒకానొక దశలో సెక్యూరిటీ సిబ్బందిని పిలిచి వారిని బయటకు పంపు..గెట్ అవుట్ అంటూ మందలించారు. వెంటనే ట్రాన్స్‌కో ఎస్ఈని పిలిచి వారి పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని పై బుధవారం అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఈఈకి చెప్పారు. ఈ మేరకు ఆయన ఐదుగురు జూనియర్ లైన్‌మెన్లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

పాలక మండలి పదవులకు 57 దరఖాస్తులు

చౌడేపల్లి: జిల్లాలో రెండవ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయ నూతన పాలక మండలి పదవుల నియామకానికి మొత్తం 57 మంది దరఖాస్తులు చేశారని ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. గురువారం పుంగనూరు మండలం ఇటికినెల్లూరుకు చెందిన ఎస్‌కె. రమణారెడ్డి, ఆయన సతీమణి రతీదేవి, కుమారుడు రాజశేఖర్‌రెడ్డితోపాటు మరో 33 మంది సభ్యులు దరఖాస్తులను కూటమి నేతలతో కలిసి ఈఓకు అందజేశారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్‌కె రమణారెడ్డి, రతీదేవి గతంలో బోయకొండ ఆలయ పాలక మండలి చైర్మన్లుగా పనిచేశారు. మరోసారి చైర్మన్ బరిలో దిగారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, సోమల సురేష్, యధుశేఖర్ నాయుడు, ఆసూరి బాలాజీ, కృష్ణం నాయుడు, కృష్ణానాయక్, బల్లాపురం నరేష్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.



బోయకొండ ఈఓకు దరఖాస్తులను అందజేస్తున్న రమణారెడ్డి

రేషన్ బియ్యం స్వాధీనం

గుడిపాల: తమిళనాడు నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం.. గంగాసాగరానికి చెందిన రాజేష్ రామాపురం పంచాయతీ అరుల్‌పురం గ్రామంలోని అలెక్స్‌కు చెందిన గోడౌన్‌ను అద్దెకు తీసుకున్నాడు. తమిళనాడు నుంచి రేషన్ బియ్యం తెచ్చి ఇక్కడ స్టాక్ పెట్టుకొని పలమనేరు, బంగారుపేటకు ఎక్కువ రేటుకు విక్రయించేవాడు. ఆ సమాచారం మేరకు పోలీసులు అతనిపై దృష్టి సారించారు. తమిళనాడు నుంచి పూర్ణ అనే అతను ఆటోలో రేషన్ బియ్యం తీసుకొచ్చి విక్రయిస్తుండగా దాడిచేసి పూర్ణ, రాజేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 900 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

రాజనాలబండ హుండీ ఆదాయం రూ.4.13 లక్షలు

చౌడేపల్లి: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి హుండీ ఆదాయం రూపేణా రూ.4.13 లక్షలు సమకూరిందని, దీనిని ఆలయ ఖాతాకు జమ చేస్తామని టీటీడీ సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఇటీవల రాజనాలబండలో నిర్వహించిన తిరునాళ్ల సందర్భంగా భక్తులు హుండీ సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సీవీ. శ్రీహర్ష, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు భానుప్రకాష్, కృష్ణమూర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు రుసుం చెల్లించొద్దు

చిత్తూరు అర్బన్: వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసుకునే మండపాలకు ఎలాంటి రుసుం చెల్లించొద్దని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకొచ్చామన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తే సరిపోతుందన్నారు. కొత్త వెబ్‌సైట్‌ను రూపొందించామని, తద్వారా వివరాలు నమోదు చేస్తే చాలన్నారు. సౌండ్‌సిస్టమ్ నిర్వహణకు మీసేవ ద్వారా అనుమతి పొందాలన్నారు. కచ్చితంగా చవితి నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు.

అవార్డులకు ఎనిమిది ప్రతిపాదనలు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 8 ప్రతిపాదనలు పంపారు. జిల్లా వ్యాప్తంగా 33 మంది టీచర్లు దరఖాస్తు చేసుకోగా.. అందులో 27 మంది డీవైఈవోలకు ప్రతిపాదనలు అందజేసి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూలలో 8 మందిని ఎంపిక చేసి రాష్ట్రానికి నివేదికలు పంపారు. ఆ ఎనిమిది మంది టీచర్లకు రాష్ట్ర స్థాయిలో మరోమారు ఇంటర్వ్యూలు నిర్వహించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక చేయనున్నారు.

విద్యుత్‌షాక్‌తో కూలీ మృతి

బంగారుపాళెం: మండలంలోని జయంతి గ్రామం వద్ద గురువారం సాయంత్రం విద్యుత్‌షాక్‌కు గురై బీహార్‌కు చెందిన కూలీ మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలో ఎక్స్‌ప్రెస్‌హైవే రోడ్డు పనులు జరుగుతున్నాయి. బీహార్ రాష్ట్రం, చంబా జిల్లా, జహీరా గ్రామానికి చెందిన సురేంద్రరాయ్ కుమారుడు బబ్లుకుమార్(19) బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా వెల్డింగ్ చేసేందుకు ఐరన్ రాడ్ పైకి తీశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాతు సమీపంలోని విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన బబ్లుకుమార్‌ను చికిత్స నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రోన్‌తో పేకాటరాయుళ్ల వేట!

– రూ.13,890 నగదు, సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు సీజ్



రొంపిచెర్ల: పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రోన్ కెమెరాతో దాడి చేసి జూదరులను పట్టుకున్న సంఘటన కల్లూరు సర్కిల్ పరిధిలోని రొంపిచెర్ల పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చిత్తూరు స్పెషల్ బ్రాంచ్ సీఐ సూర్యనారాయణ కథనం..గానుగచింత గ్రామ పంచాయతీలోని జగడంవారిపల్లె అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నారని స్థానిక పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదని కొందరు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ రంగంలోకి దిగారు. చిత్తూరు నుంచి పోలీసు సిబ్బంది పక్కా వ్యూహంతో వచ్చారు. అయితే అటవీప్రాంతం కావడంతో జూదరులను పట్టుకునేందుకు శ్రమించాల్సి వచ్చింది. దీంతో డ్రోన్ కెమెరా సాయంతో మామిడి తోటలో జూదం ఆడుతున్న వారిని గుర్తించారు. దాడి చేసి గానుగచింత నగిరికి చెందిన ఎస్.మురళి(44), జి.రెడ్డి ప్రసాద్ (34) (జగడంవారిపల్లె), ఏ.విశ్వనాథ (45), (చంద్రగిరి), ఎస్.షౌకత్‌అలీ (44) (పెద్దమల్లెల కస్బా), ఏ.ఆనంద్(31) (కేవీపల్లె), కె.రమణారెడ్డి (63) (కాకులారంపల్లె), ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన కె.రెడ్డెప్ప (45)ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ13,890 నగదు, 7 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.



జూదరులను పట్టుకున్న డ్రోన్ కెమెరా, స్పెషల్ బ్రాంచ్ సీఐ సూర్యనారాయణ

సబ్సిడీ వివరాలు సరిచూసుకోండి



వివరాలను రైతులకు తెలియజేస్తున్న మురళీకృష్ణ

గుడిపాల: మామిడి సబ్సిడీకి సంబంధించి రైతులు తమ వివరాలను సరిచూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణా తెలిపారు. గురువారం బసవాపల్లెలో మామిడి సబ్సిడీకి సంబంధించి రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తోలిన రైతులు మరొకసారి వారి బ్యాంక్ ఖాతాలను సరిచూసుకోవాలన్నారు. రైతుల సమక్షంలో వారి వివరాలను సచివాలయం వద్ద అతికించారు. అనంతరం పొలం పిలుస్తుందిలో భాగంగా చెరుకు, వేరుశనగ పంటలను ఆయన పరిశీలించారు. వ్యవసాయాధికారి సంగీత, అగ్రికల్చర్ అసిస్టెంట్ యోగప్రియ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో విద్యుత్ చౌర్యం



కార్వేటినగరం: డైట్ కళాశాలలో ఓ అధ్యాపకుడు విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలు.. డైట్ కళాశాలలో పనిచేస్తున్న ఓ అధ్యాపకుడికి ఎలక్ట్రిక్ కారు ఉంది. గత కొన్ని రోజులుగా అతను సమీపంలో ఉన్న వసతి గృహం నుంచి కారుకు చార్జింగ్ చేసేవాడు. గుర్తించిన విద్యార్థులు సదరు అధ్యాపకుడిని ప్రశ్నించగా.. ఆయన పట్టించుకునేవారు కాదు. పైగా ప్రాక్టికల్ మార్కులు తన దగ్గరే ఉన్నాయని, ఎవరికైనా చెబితే తగ్గించేస్తానని ఛాత్రోపాధ్యాయులను బెదిరించేవాడు. ఈ క్రమంలో తన కారుకు విద్యుత్ చార్జింగ్ చేస్తున్న వీడియో గురువారం హల్‌చల్ చేసింది. దీనిపై సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మామిడి బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న హేమలత

పుత్తూరు: మామిడి రైతులకు వెంటనే బకాయిలు చెల్లించాలని మామిడి రైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన విధంగా మామిడి ఫ్యాక్టరీ యాజమాన్యాలు కేజీకి రూ.8, ప్రభుత్వం రూ.4తో కలిపి మొత్తం రూ.12 వంతున చెల్లించాలన్నారు. రోజులు గడిచిపోతున్నా ఫ్యాక్టరీ యాజమాన్యాలుగానీ, ప్రభుత్వం గానీ నగదు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నాయని ఆరోపించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరూ ఐక్యంగా ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హరిబాబు, ఆనందనాయుడు, యువరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

పుత్తూరు: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్లు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అక్కడి నుంచి నగరం రోడ్డు కూడలి వరకు ప్రదర్శనగా వెళ్లి మానవహారం చేపట్టారు. యూనియన్ నాయకురాలు మునికుమారి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.